# మరుపురాని మాఊరు



పుట్టిన ప్రతి ప్రాణికి ఎప్పుడూ ఏదో ఒక కోరిక మనసులో పుడుతూనే ఉంటుంది. అందులో మానవజన్మాలకయితే పుట్టగొడుగుల్లా పుడుతుంటాయి. వాటికి అంతూ పొంతు ఉండదు. పరిస్థితులు అనుకూలిస్తే కోరికలు తీరుతాయి. లేదా, అడవి పూలవుతుంటాయి. నేనూ ఒక ప్రాణినే! అందులో మనిషిని. అందుకే నాలో కూడ ఓ కోరిక పుట్టింది.

ఓస్! ఇదేమి కోర్కె? అని విన్నవాళ్ళు నవ్వుతారు.

ఇక మా శ్రీమతిగారి సంగతి చెప్పనవసరమే లేదు. మాట చెవిని పడితే చాలు! అప్పటికి అదేదో కోరరాని కోరిక అయినట్టూ దానితో కొంపలు మునుగుతున్నట్టు ఆమె రుసరుస లాడుతుంది. సంపెంగలాంటి అందమైన ఆమె నాసిక ఉన్నపళంగా ఊదన గొట్టమై బుసకొడుతుంది. ఆమె రుసరుసలు బుసబుసలు మొదలయ్యే సరికి, అంతవరకు సడీచప్పుడు లేకుండా పడివుండిన పాత్ర సామానులకు అమాంతంగా కాళ్ళు వచ్చి, పొగరెక్కిన ఆంబోతులై ఒకదానిమీద మరొక్కటి కాలుగీరుతూ ఖణిల్లని రంకెలు వేస్తుంటాయి వంటింట్లో! ఈ

అవాంతరాలన్నింటినీ సహించి ఆపై సాహసించి అగ్గిబరాటమైన అధికారి ముందు ఒక్కరోజు సెలవుకోసం నసిగే 'ఎన్జీవో'లా నోరు జారితే– "అబ్బబ్బ! మా ఊరు! మా ఊరు!!" అని ఒకటే మొత్తుకోళ్ళు, ఏం వుండాదక్కడ? చారెడు మంచినీళ్ళిచ్చే గెతి ఉంటే ఇక చెప్పాల్సిన పనేలేదు!" అని నిలదీస్తుంది.

నా నోరు తడబడుతుంది.

నిజమే! అక్కడ– అంటే ఆ పల్లెలో ఏమీలేదు. పల్లెనుండి బండ్లకెత్తి తోలకరావడానికి ముల్లెలూ లేవు. విచ్చి వికసించి నా కోసం ఎదురుచూసే మల్లెలూ లేవు!

ఆ పల్లె 'మిద్దూరు'గా పేరుపడింది. మిద్దెలెరగని నాటికే ఆ పల్లెలో మిద్దెలు ఆ పల్లె కాపేరును సార్థకపరిచాయి. మా తాత పెదరామిరెడ్డి. అతని తమ్ముడు చినరామిరెడ్డి. ఆపాయకట్టులో వీళ్ళిద్దరు మకుటంలేని మహారాజుల్లా బతికారు. ఈ నాటికీ మేము వాళ్ళ పేరుమీదనే చారెడు నీళ్ళు తాగగలుగుతున్నాం ఆపాయకట్టులో అంటే– మా శ్రీమతి ఒప్పుకోమంటే ఒప్పుకోదు కానీ, ఇదిమాత్రం కాదనలేని సత్యం. పెదరామిరెడ్డి చినరామిరెడ్డి ఇద్దరు అన్నదమ్ములు. దున్నపోతు దున్ని చావాలి. అన్నదమ్ములై పుడితే వేరుపడి తీరాలి. పెదరామిరెడ్డి, చినరామిరెడ్డి కూడ వేర్లుపోయారు. సగం గ్రామం పెదరామిరెడ్డి ఏలుబడిలోనికి వస్తే, మరో సగం చినరామిరెడ్డి మోచేతికింద నిలిచింది.

పెదరామిరెడ్డి పేరుకుదగ్గ మనిషి. గుండెబలం కండబలం మెండుగా ఉన్న మొనగాడు. కల్లు అంగళ్ళ ఇజారాదారుడతగాడే! ముద్దుకొమ్మల పెద్దపెద్ద కళ్ళల్లోని కైపు జీరకోసం పారాడేదీ అతగాడే! మదిర! మదువు!! ఎప్పుడూ పదిమంది చుట్టూ కొలువుదీరి ఉండేవాళ్ళు. పదిమంది ఉంటే పది రకాల మాటలూ ఉండడం కద్దు. వేర్లుపడిన అన్నదమ్ముళ్ళల్లో ఈర్ష్యాగ్ని రగలడానికి అదును పదును చూసి ఒక్కొక్క సమిధను సమర్పించే వాళ్ళు కొందరు. ఫలితంగా పెదరామిరెడ్డి పూరిండ్లు పరుశురామప్రీతి అయ్యాయట!

ఇదంతా చినరామిరెడ్డి పన్నాగమన్నారు కొందరు. కాదు కాకతాళీయ మన్నారు మరికొందరు. అన్నదమ్ముళ్ళను జుట్లు పట్టించి వేడుక చూడడానికి మధ్య రాలింది ఏరక తినడానికి ఎత్తుగడ అన్నారు కొందరు.

ఆ పల్లెలో ఊహాగానాలను మోయలేక మూలిగాడు వాయు దేవుడు!

పెదరామిరెడ్డి మాత్రం నిప్పులు కక్కాడు. కత్తికి కండ చేయాలనుకొన్నాడు తమ్ముడిని. ఎంతయినా రక్తపాశం గదా? 'పూరిండ్లయితే కాల్చగలిగాడు వెధవ!– అదే మిద్దిండ్లయితే?– ఒక్క వెర్రినవ్వుతో సరి పెట్టుకొన్నాడు. మూడుం ముక్కాలు గడియకే మిద్దిండ్లు కట్టించాలనుకొన్నాడు. అర ఫర్లాంగుదూరం చుట్టూ ప్రహరీగోడ... మధ్యలో ఓ సుద్దమిద్దె !– గృహప్రవేశ మహోత్సవానికి నాలుగు కండబట్టిన పొట్టేళ్ళు... నాలుగుబానల కాపుసారా అయిపులేకుండా అయిపోయిందట!– ఈనాడు ప్రజాప్రభుత్వంలో ఎన్నికలకు ఎర అయిపోతున్న సామాన్య జనానికి పూర్వీకులు వాళ్ళు! తిని తాగిన మత్తులో పెదరామిరెడ్డికి జై! మిద్దూరికీ జై!! అన్నారట.

ఆనాటి నుండి ఆ ఊరికి మిద్దూరుగా పేరుపడింది.

వాళ్ళతరం చెల్లింది. మా నాన్నగారి హయాంలో ఆ సుద్దమిద్దెలు భద్రంగానే కాపాడారు. లేదంటే చుట్టూరావున్న అరఫర్లాంగు దూరం ప్రహరీగోడ మాత్రం అక్కడక్కడ పడిపోయింది. సుద్దమిద్దెను లాదు మిద్దెగా మార్చాలన్న సంకల్పంతోనే ఆయన జీవితకాలం సరిపోయింది. ఆ తరువాత నేను ఉద్యోగరీత్యా ఊరు వదిలిపెడితే, మా అన్నగారు బాధ్యతలను తలకెత్తుకొన్నారు. అన్నగారికి మా తాతగారి గుణాలన్నీ అలవడ్డాయని అంటూఉండేవాళ్ళు. వినడమేకాని చూడడానికి అస్కారం లేక పోయింది నాకు. ఎవరో ఓ జ్యోతిష్కుడు మా మిద్దింటికి వచ్చాడట. అన్నగారికి తలరాతకంటే జాతకరాతలమీద నమ్మకం జాస్తి. జ్యోతిష్కునికి గౌరవ మర్యాదలు ఘనంగానే జరిగాయి.

ఆ దెబ్బతో ఉబ్బి తబ్బిబ్బులై నాడు జ్యోతిష్కుడు.

"నాయనా! నీవు మీ తాతను మించిన వాడవుతావు. మీ తాత సుద్దమిద్దెలు కట్టిస్తే- నీవు పెద్ద పెద్ద మహడీలే కట్టిస్తావు. అయితే మీ తాతగారు వాస్తు శాస్త్రాన్ని పాటించలేదు. అందుకే ఈ కుటుంబం మూరెడు ముందుకు పోతే బారెడు వెనక్కు వస్తూఉంది. ఈ ఇంటికి తూర్పువాకిలి అరిష్టం, దక్షిణ వాకిలి పెట్టికట్టావంటే- దేదీప్యమానంగా వెలిగిపోతుంది సంసారం" అన్నాడట.

అంతే! తాతకు దగ్గ మనవడు గదా! కట్టించడానికి మూడుంముక్కాలు గడియపడితే, పడగొట్టించడానికి ముక్కాలు గడియ సరిపోయిందేమో. సుద్దమిద్దెలు సుద్దంగా నేలమట్ట మయ్యాయి. దూలమొకటి విరిగి అన్నగారి కాలిమీద పడింది. ఆయన నేలకు ఒరిగాడు. ఒరిగినతడు లేవలేదు కానీ, ఆ ఇంటి అడుగులో జిల్లేళ్లు మాత్రం లేచాయి. పాడుపాడిన ప్రహరీ గోడ... జిల్లేళ్లు మొలిచిన ఇంటి అడుగు... మా తాతగారి గత వైభవ స్మృతి... కళ్ళు చెమర్చుతాయి ఆ ఇంటిముందు నిలబడితే!

అందుకే మా ఊరిని మరిచిపోలేను!

పుట్టిన ఊరిపై మమత పూడిపోతుంది కాలగర్భంలో! కానీ మా ఊరిపై మమత పెరుగుతూనే ఉంటుంది. కారణం ఆ ఊరి నిర్మాణం అలాంటి చక్కటి ప్రదేశంలో జరిగింది. ఊరికి దక్షిణంగా మంచినీటి గుంట... ఆ గుంట నిండుకు వికసించిన కెందామరలు... ఆ గుంటకట్టపై చల్లని నీడ నిస్తూ పచ్చని చెట్లు... ఆచెట్ల కింద కాసిరాయి బండలూ... ఆ బండలమీద పులిజూదంతో పొద్దుపుచ్చే కలిగిన ఇంటి కామందులూ... ఊరికి ఉత్తరంగా పెట్టని కోటగోడల్లా పచ్చని కొండలూ... ఊరి చుట్టూ అంతకంటే పచ్చని పొలాలు... ఊరి మధ్యలో రామాలయం... రాత్రిపూట ఆ ఆలయంలో భజనలు... ఏ చెట్టు కింద కూర్చున్నా తిండితిప్పలే మరిచిపోవాలనిపిస్తుంది. బాల్యమంతా ఆ గ్రామంలోనే గడిచిపోయింది. మనిషి జీవితంలో మధురాతి మధురమైనది బాల్యదశ. ఆదశ... అది గడిచినచోటు... చెరగనిముద్ర వేసుకొంటాయి ప్రతివ్యక్తి గుండెల్లో. తలపుకు వచ్చినపుడు మనిషిని తైతక్కలాడిస్తాయి. ఆ

ఊపును ఆపుకోవడం కష్టం. అందుకే ఉద్యోగ బాధ్యతలు ఒకవైపు వేధిస్తున్నా శ్రీమతి మరొకవైపు సాధిస్తున్నా లెక్క చేయకుండా పల్లెను చూడడానికని బయలుదేరాను. దాదాపు రెండు దశాబ్దాల తరువాత నేను పుట్టిపెరిగిన పల్లెను చూడడాని కని బయలుదేరాను.

నలభై మైళ్ళ దూరాన కొండల గుండెల్లో దాక్కొన్న మా పల్లె. మూడు బస్సులు మారి ఆ పై నాలుగుమైళ్లు కాళ్ళీడ్చుకుంటూ నడిస్తేనే గానీ కంటబడదు. ఈ పదేండ్లలో ప్రభుత్వం సాధించిన ప్రగతి ఫలితంగా ఇప్పుడా నాలుగుమైళ్లు కూడ నడవ వలసిన అవసరంలేదట! ఒక్క డొక్కుబస్సుతో ధక్కాముక్కీలు తింటూ ఉండిన నలగాంపల్లి నాయుడుకి నాలుగు బస్సులయ్యాయట! రెండంటే రెండు గంటలు అక్కడ వేచివుంటే బస్సువస్తుందట! ఆ అడవి కొంపల్లో అడిగే నాధుడే లేడు కాబట్టి ఉప్పు మూటల్లా మనుషుల్ని బస్సులో కూరుతారట! కాగా సీటు దొరకదన్న భయమేలేదని అభయమిచ్చారు పెనుమూరుపేట బస్టాండులో!

అప్పటికి రెండున్నర దశాబ్దాల కిందటిమాట. తూర్పున పటమెగరకముందే అమ్మకట్టిచ్చిన చద్దిబువ్వ మూటలు భుజాలకు తగిలించుకొని పెనుమూరులోని హయ్యర్ ఎలిమెంటరీ పాఠశాలలో చదువుకోవడానికి నడిచి వెళ్ళేవాళ్ళం. బడిలో చదువుకోవడం మధ్యాహ్నంపూట ఏ బావిగట్టుమీదనో కూర్చొని చద్దిబువ్వతినడం సాయంత్రం బడివదలగానే మళ్ళీ నాలుగుమైళ్ళు నడిచి ఇల్లు చేరుకోవడం. చదివి ఏదో సాధించాలన్న కోరిక ముందు నాలుగు నాలుగు ఎనిమిదిమైళ్ళు నడిచిన బాధ తెలిసేదేగాదు. అందులో అంతా ఒకఈడు పిల్లవాళ్ళం. కలిసి ఆడుకొంటూ పాడుకొంటూ తిరిగేవాళ్ళం. అదంతా మనసులో మెదిలితే రెండు గంటలు బస్సు కోసం ఎదురుచూడడం కంటే నడిచి వెళ్ళడమే మంచిదనిపించింది.

పెనుమూరి నుండి నడక ప్రారంభించాను.

మా ఊరి మట్టిబాటమీద నడుస్తున్నాను. ఏదో పూనకం పూని నట్లు గతస్మృతి ఆవరించింది. అడుగుతీసి అడుగువేస్తుంటే నడిచినట్లు తెలియడమేలేదు. ఎక్కడో ఏదో స్వర్గసుఖంలాంటది నాకోసం కాచుక కూర్చున్నట్టు, దానికోసమే నేను రెక్కలు కట్టుకొని ఎగురుతున్నట్టు అదొక దివ్యానుభూతి. ఈ మట్టి నాకు సుపరిచితమైంది. ఆ మట్టిలో ఆడుకొన్నాం. పడి దొర్లాం. కోపమొచ్చి కొట్లాడుకున్నప్పుడు ఆ మట్టినే ఆయుధంగా ఉపయోగించి ఒకరిపై ఒకరు చల్లుకొన్నాం. ఆ తరువాత దుమ్ముతో నిండిన దుస్తులను చూసి నిస్సహాయంగా ఏడ్చుకొన్నాం. ఇవన్నీ మనసులో మెదులుతూంటే గుండె ఉబ్బిపోతూ ఉంది. అంతలో ఎవరో ఒక రైతుబిడ్డ మంచికండబట్టిన గిత్తల్ని బండికి గట్టించి పరుగెత్తిస్తున్నాడు. ఆ గిత్తలు పరుగులెత్తే కొద్దీ అతడికి హుషారు ఎక్కువై పోతూఉంది. అతనిలో హుషారు ఎక్కువయ్యేకొద్దీ గిత్తలు పరుగందు కొంటున్నాయి. మట్టిబాట మీద కావిరంగు దుమ్ము సంధ్యారుణ కాంతులతో పోటీపడుతూ లేచింది. దారిపక్కన నడుస్తున్న నన్ను నిలువునా కప్పేసింది. ఓరోజు ఆఫీసులో మా రాధయ్య టేబులు తుడుస్తున్నాడు. ఎక్కడో కాస్తదుమ్ము వదిలిపోయింది. ఆ రోజు వాడి దుమ్ము దులిపేశాను. అదీ దుమ్మే! ఇదీ దుమ్మే!! అయితే ఆ

దుమ్ముకు ఈ దుమ్ముకు ఎంత తేడా? – ఆ అనుభూతిలో అది దుమ్ముకాదు – ఓ మహాత్ముని చేతినుండి రాలిన విభూతి!

నాలో నేను నవ్వుకొంటూ నడుస్తున్నాను.

"ఏ ఊర్సా మీది?"

సుమారు మూడు పదులు వయస్సు దాటినవాడు. మూతిమీది మీసాన్ని మెలేసిన వాడు... అడ్డపంచ అరవకట్టుపై టెరిలీన్‌స్లాక్ ధరించినవాడు... పల్లె పట్టణంతో వియ్యమంది నేర్చుకున్న నాగరికతకు అల్లుడై నలుగుతున్న వాడు... మా ఊరి మట్టిబాటపై నా పక్కన నడుస్తున్నవాడు... అడుగు తున్నాడు.

మనిషిని కాసేపు ఎగాదిగా చూసి "మిద్దూరు" అన్నాను

"మిద్దూరా?" ఆశ్చర్యం ఆవిర్లు కక్కింది అతడి మాటల్లో,

"అవును."

"మిద్దూర్లో ఎవురబ్బా?" అతగాడి సందేహం

"పెద్దరామిరెడ్డి మనవణ్ణి".

"పెద్దరాఁవిరెడ్డి మనఁవడా? మరి నడిచే పోతుండావే?"

అదో రకంగా చూశాడతడు నన్ను!

'పెదరామిరెడ్డి మనఁవడేంది? ఈ నడవడమేంది?' అన్న ఆశ్చర్యం అతని చూపుల్లో తొణికిస లాడుతూ ఉంది. పెదరామిరెడ్డి మనఁవడు నడవరాదన్న సత్యం నే నెరగనిది. అప్పటికి మా తాత గతించి అర్ధ శతాబ్దం దాటింది. అర్థ శతాబ్దం తరువాత అతని మనఁవడికి జరుగుతున్న గౌరవ మర్యాదలకు మా తాత పేరు ప్రతిష్టలకు ముడేయడానికి ప్రయత్నించాను. పొంతనాలు కుదరలేదు. అదే ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

"అది గాదు సా! ఆ గొబ్బిళ్ళ మిట్టలో మాటమాత్రం అనుంటే ఎవుడైనా ఒకడు బండి కట్టేవాడే! ఈ బారడుదూరం బండి కట్టితే కొంపలు మునిగిపోతాయా?"

"పోనీ! ఈ బారడుదూరం నేను నడిస్తే మాత్రం మునిగిపోయే దేముంది?"

"బలేవాడుసా నువ్వు? అప్పటికి మేఁవంతా బతికినట్టా? సచ్చినట్టా? ఈ గొబ్బిళ్ళ మిట్టకు పినపెద్ద మా తాత. మీతాత మా తాతసావాసకాపులంట. ఈ పొద్దు మా సేతినీళ్ళు మేఁవు తాగతాఉండాఁవంటే అది మీ తాత సేతి సలవేనంట!"

ఇలాంటి మాటలు అపాయకట్టులో తరచు వినిపిస్తున్నవే! అయితే మా తాత ఎవరి కేలాంటి సహాయం చేశాడో వివరాలు మాత్రం తెలియవు. అయితే ఈ తరానికి ఆ తరానికి భేదం మాత్రం కొట్టొచ్చినట్లు కనబడుతూనే ఉంది.

మా ఆఫీసుకు ఆరునెలల కొకసారి ఓ కవి వస్తూ ఉండేవాడు. ముందెప్పుడో ఓ రాక్షసుడు ఆరునెలలు తిండి. ఆరునెలలు నిద్రగా బతికాడట! ఆ విధంగా ఈ కవి ఆరు నెలలు దేశాటనం

చేస్తాడు. తన పుస్తకాలమ్ముకొంటాడు. వచ్చింది తింటూ స్వస్థలంలో కూర్చుని మరో ఆరునెలలు కవిత్వం రాసుకొంటాడు. తెలుగుదేశం పరిస్థితులకు ఎదురీది బతికేది తానొకడేనంటూ ఢంకా భజాయించి చెబుతాడా కవి.

ఆ కవి ఒకప్పుడు ఉద్యోగార్థమై దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి దగ్గరికి వెళ్ళాడట! వెళ్ళి ఒక ఉద్యోగమిప్పించమని సవినయంగా మనవి చేసుకొన్నాడట!

అప్పుడు పంతులుగారు'నీకు తెలుగు వచ్చా?' అని ప్రశ్నించారట! 'అయితే మీకు తెలుగు రాదా?" అని ఎదురుప్రశ్న వేశాడట కవి. పంతులుగారు ఆశ్చర్యపడి చూస్తూంటే, 'ఇంతసేపు నేను మాట్లాడింది తెలుగే గదండీ!' అన్నాడట కవి. చిరునవ్వుతో తల పంకిస్తూ పంతులుగారు కవి గారికి వెంటనే ఉద్యోగం ఇచ్చారట! ఈ తరాల ప్రసక్తి వచ్చినపుడంతా కవి పంతులుగారి వద్ద చేసిన ఉద్యోగానుభవాలు కథలాగా చెప్పేవాడు.

పంతులుగారిని ప్రతిదినం ఎందరో దర్శించేవాళ్ళట. 'ల'కు ఏత్వము, 'ద'కు కొమ్ము-ఇవ్వలేని దాతలట పంతులుగారు. కొన్ని సమయాల్లో కొందరు ఆయన్ను పచ్చిగా మోసగించేవాళ్ళట!

"పంతులుగారూ! మదరాసు చూద్దామని బందరునుండి వచ్చామండీ! ఎవరో దొంగ వెధవలు జేబు కొట్టేశారండీ! తిరిగి వెళ్లాలంటే చార్జీలు కూడ లేవండీ!" అని మొరపెట్టుకొనే వాళ్ళట.

అలా అడిగిన మనిషిని ఒకసారి గమనిస్తే, అతడు సిల్కు లాల్చీతొడిగి ఉంటాడట. చేతి వేలివేలికీ బంగారు ఉంగరాలు ఉంటాయట. కిళ్ళీ వడేసి వడేసి నములుతూ ఉంటాడట. ఎవడైనా ఈ మనిషి జేబుకొట్ట గలడా? అన్న ఆశ్చర్యం కలుగుతుందట! కానీ పంతులుగారు అతనివైపు చూడనే చూసేవారు కాదట. జేబులో చెయ్యి వేయడం!... చేతికి వచ్చింది వచ్చినవాడి అదృష్టం మీద ఆధారపడి ఉంటుందట. "ఆ కాలానికి, ఈ కాలానికి సాటి బెట్టడానికి వీలుకాదులే నాయనా! ఎందరో పంతులుగారి ఆశ్రయంలో బతికితే- ఈనాడు ఆంధ్రదేశం నాలాంటి ఒక్క కవిని పోషించలేని స్థితిలో ఉంది." అని వాపోయేవారు.

ఉప్పుతిని తిన్నయింటికే వాసాలెంచేది ఈ తరం. మా తాత మీ ముత్తాతకు పది రూపాయలు బాకీ ఇచ్చాడట! వడ్డీ అసలు కలిపితే అంతకు మూడంతలయింది. 'అక్కడపెట్టి కదులు!' అనేది ఈ తరం. అయితే ఈ తరంలో కూడ కృతజ్ఞతా భావం చావలేదే అనిపిస్తూ ఉంది అతని మాటలు వింటూంటే! అతడి అభిమానానికి కృతజ్ఞత ఎలా తెలపాలో తెలియక మౌనంగా నడుస్తున్నాను.

"ఏఁవిసా! నోరు గదిపితే నోటి ముత్యాలు రాలిపోతాయా? ఆఁ! ఊఁ! అనుకుండా బెల్లంకొట్టిన రాయి మాదిర నడస్తాఉండాఁవే!" ఆ మాటతో ఉలిక్కి పడ్డాను!

నిజమే! మూడు పూటలు తిండిలేక మూలుగుతున్నా, ముక్కులు దాకా మెక్కి తేపుతున్నా దహన సంస్కారానికి నోచుకోలేక కొంపలో శవాన్ని పెట్టుకొని కుమిలిపోతున్నా, ఎవరిదారి

వాళ్ళదేగా అదే సభ్యతగా రూపొందిన పట్టణ వాతావరణాన్ని నిలువెల్ల నింపుకొన్న వాడిని. పల్లెల్లో అరమరికలు లేని తేనెపట్టుల్లాంటి మనస్సులలోని ఆదర భావాన్ని మరిచిపోయిన వాడిని. మతికి తెచ్చుకోవడానికి కాసేపు పట్టిన మాట వాస్తవం.

"ఎందాకా వెడుతున్నావయ్యా"

"నువెక్కడికో నేనూ అక్కడికే!

" మాఊరికా?"–

"ఎందుకుసా అట్లులిక్కి పడతావే? రేత్రికి మీ ఇంటికి రాన్లేబ్బా దండగ తిండికి!"

నా మనస్సు చివుక్కుమనింది. అప్పటికి ఆ ఊళ్ళో నాకొక ఇల్లు ఉన్నట్లు... అతడు చుట్టమై దాపురించినట్లు... దానికి నేను బెంగపడినట్లు అనుమానపడ్డాడు అమాయకుడు. అందుకే మెత్త మెత్తగా ఎత్తిపొడిచాడు. అయినా నేనేమని చెప్పేది? అతడి హృదయంలో పెదరామిరెడ్డి మనవడికున్న ఒకగొప్ప అభిప్రాయాన్ని అభిమానాన్ని ఎలా తుడిపేసేది? తలదాచుకోవడానికి కానీ, కడుపు తడి చేసుకోవడానికి కానీ, ఆ ఊళ్ళో అప్పట్లో నాకంటే గూడ అతడే అదృష్ట వంతుడని నేనెలా చెప్పేది? అభిమానం అడ్డుపడింది. అయిన దానికి కానిదానికీ అభిమానాలు పెంచుకుంటూ అంతస్థులు సృష్టించుకుంటూ ఆత్మవంచన చేసుకుంటూ బతికే పట్టణాలకు తొత్తును. అరమరికలులేకుండా అతడిలో మాట్లాడడం కష్టమనిపించింది. అందుకే మాట మార్చాను.

"మా ఊరి కంటున్నావే? ఏం పనిమీద?"

పకపకా నవ్వాడతడు. 'నీ యాదన నాకు తెల్సులే!' అన్నట్లుందా నవ్వు.

"మీ ఊరిగ్గాదుసా నే నొచ్చేది. ఇంకొంచెం పైకే పోతాఉండా. పెనువూరు ముత్తేలమ్మకు పొంగళ్ళు పెడ్తాఉండాం. బొట్లోళ్ళ పల్లెలో మా బందుగులుండారు. పిలద్దావని పోతాఉండా. నీ పెండ్లి నడక నాకు కుదిరేటట్టు లేదు. నే వస్తా."– అతడు కాస్త జోరుగా కాలాడించాడు.

అంతవరకు అటు యిటూ తాగినవాడి మనస్సులా తూలుతూ, శరీరంలా పడుతూ లేస్తూ వచ్చిన మా ఊరి మట్టిబాట అక్కడ– ఆ మామిడిమాకుల వంక దగ్గర ఉన్నట్లుండి మిట్టదారి పట్టింది. పొద్దు బాగా పడమటికి వాలింది. చిట్టడవి గుండెల్ని చీల్చుకొనిపోతున్న ఆ మట్టిబాట సంధ్యారుణకాంతులతో రక్తసిక్తమైనట్లుంది. గస పోసుకొంటూ నేను మిట్ట ఎక్కుతూంటే మెదడు గతాన్ని తొక్కడాని కారంభించింది.

మామిడిమాకుల వంక... ఆ చిట్టడవిలో వయ్యారంగా వాహ్యాళికి బయలుదేరిన చిన్నారిలాంటి చిన్నవంక. వానకాలంలో అదిగూడ ఒక వంక కింద లెక్కే. మిగత రోజుల్లో ఆ వంకలోని ఇసుక మా పాలిట కామధేనువు. బడి వదలగానే కొంప లంటుకపోతున్న వేగంతో ఆ వంకలో చేరుకునేవాళ్ళం. చెడుగుడు ఆడేవాళ్ళం. ఉప్పరపట్టి కాసేవాళ్ళం. బాగా చీకటిపడితేగాని ఆ వంకను విడిచేవాళ్ళం కాదు. ఆడిఆడి అలసిసొలిసి చెమటోడ్చుతూ ఇంటికి వెళ్ళితే 'పాపం! పిలకాయలెంత కష్టపడి చదివినారో!' అని ఇంట్లో వాళ్ళు వాపోయేవాళ్ళు.

బాటకు కూత దవ్వులో ఈ వంక గట్టుమీద ఒక బావి ఉంది. ఆ బావిలో నీళ్ళు అప్పుడే వార్చిన గంజిలాగ ఉంటాయి. అందుకే ఆ బావికి 'గంజినీళ్ళ బావి' అన్న పేరు సార్థకమయింది. చుట్టూ నేరేడు చెట్లు, మామిడి మాకులు, పరిగపొదలు!... మధ్య అందమైన మట్టిగట్టు ఆ బావి. ఆ వాతావరణాన్ని చూస్తే అక్కడ కాసేపు కూర్చుందామన్న బుద్ధి పుడుతుంది ఎవరికైనా! మిద్దూరినుండే కాదు– చుట్టుపక్కల నాలుగైదు పల్లెలనుంచి ఏడెనిమిది మంది పిలకాయలం. ప్రతినిత్యం పెనుమూరు హయ్యర్ ఎలిమెంటరీ స్కూల్లో చదువు కోవడానికి వెళ్ళేవాళ్ళం!

ఓ రోజు అందరూ గంజి నీళ్ళ బావి గట్టుమీద కూర్చున్నాం. పొద్దు కుంకబోతూ ఉంది. ఆ రోజు ఎందుకో ఆటలు మాని ఆ బావి గట్టుమీద కూర్చున్నాం. మాలో అందరికంటే వయస్సులో పెద్దవాడు చిన్నబ్బ. వాడు హరిజనుడు. హాజరు పట్టికలోనే అతడి పేరు చిన్నబ్బ. మాకు పెద్దగా పట్టింపులు లేకపోయినా అందరూ వాణ్ణి 'చిన్నోడా!' అని పిలిచేవాళ్ళం. ఆ రోజున ఉన్నట్టుండి, 'ఒకనాటికి ఈ బావిగట్టుమీద వనభోజనం చేస్తే బాగుంటుంది!' అని చిన్నబ్బ అన్నాడు. అందరు సరేనంటే సరేనని ఎగిరి గంతేశారు. మూడు కోళ్ళు తేవడం ముగ్గురివంతు అయింది. బియ్యం తేవడానికి మరో ముగ్గురు. దీనికి కావలసిన మసాలా వస్తువులు తెచ్చేది మిగిలినవాళ్ళ మీద పడింది. అడవిలో కట్టెల కేమీ కొదవలేదు. 'ఎప్పుడో ఎందుకు! రేపే పెట్టుకుంటే పోలా!' అన్నాడు చిన్నోడు. అందరు దీనికి కూడ సరేనన్నారు.

బియ్యం తెచ్చేదానికి మాటిచ్చిన ముగ్గురిలో నే నొకణ్ణి. మిగత ఇద్దరు అంత వెసులుబాటున్న వాళ్ళు గాదు. అందుకే వాళ్ళు నా చేతులు పట్టుకొని, 'ఎట్లయినా ఈ గండం గడపరా!' అని బతిమాలారు. సరేనని అభయ మిచ్చాను. కానీ నాభయం నాది. అయ్యగారు తెమ్మన్నారని అబద్ధం చెబుదామనుకొన్నాను ఇంట్లో. కానీ పెనుమూరి పేటలో సంతకని వచ్చిన మా అయ్య అయ్యోర్ని నిలబెట్టి అడిగినా అడుగును. అందుకని ఆ ఆలోచన మానుకొన్నాను. ఆ రాత్రికి భోజనాలయ్యాక ఆ ఇద్దరినీ వచ్చి కలుసుకోమని చెప్పి ఇంటికి వెళ్ళాను.

నా మాట ప్రకారం వెంకట్రాయులు, సిద్దయ్య ఇద్దరు భోజనం చేసి వచ్చారు. నన్ను పిలిచారు. అప్పటికే నేను లాంతరు ముట్టించి పెట్టుకొని మా వసారాలో కూర్చుని శ్రద్ధగా చదివినట్లు నటిస్తున్నా. పిలుపు చెవిని పడడంతో లేచి వెళ్లుతూంటే, 'ఈవేళ కాడెక్కడిరా?' అన్నాడు మా అయ్య ఎద్దులకు తవుడు కలిపి పెడుతూ ఉండి. "ఇప్పుడే వస్తానయ్యా!" అని బయటపడ్డాను. పల్లెటూళ్ళల్లో సాధారణంగా తొమ్మిది గంటల వేళకే మాటు మణుగుతుంది. ఎవరో ముసలీ ముతక మాత్రం నిద్రరాక వీధుల్లో రాతి తిన్నెలమీద కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకొంటున్నారు. ఆ వేళప్పుడు మేము ముగ్గురం కలుసుకొన్నాం. చేయాల్సింది మాట్లాడుకొన్నాం. మా ఇంటి వెనకకు నడిచాం. ప్రహరీగోడ కింద వెంకట్రాయుల్ని నిలబెట్టి, మే మిద్దరం గోడదాటి లోపలికి వచ్చాం. ఇంటికి ప్రహరీగోడకు మధ్య ఖాళీజాగాలో, జామచెట్లు గుబురుగా ఉన్నాయి. ఆ చెట్లమాటులో సిద్దయ్యను కూర్చోమన్నాను. నేను మరలా గోడదాటి ఇల్లు చేరుకొన్నాను. వసారాలో లాంతరుముందు కూర్చొని చదివిందే చదివిందిగా ఉన్నాను. నా చదువు నాకే అర్థం కాలేదు. ఎలా అర్థమవుతుంది మనస్సు ఎక్కడో ఉంటే! ఇంట్లో అందరు

పడుకొన్నారు. మా అయ్య పశువుల కొట్టంలో మంచంమీన పడుకొంటూ, "ఒరే నాయినా! జావురేత్తిరి దాటి నట్టుండాది. సదువంతా ఈ ఒకనాడే సదివేస్తే ఎట్టరా? రేపిటిగ్గూడ కాసింతవుణ్ణీరా!" అని గోముగా మందలిస్తున్నాడు. లాంతరు వెలుగుతగ్గించాను. పడుకొన్నానేగానీ మనస్సంతా ఇంటి వెనకనే తారట్లాడుతూ ఉంది. నిమిషమొక యుగంగా గడుస్తూ ఉంది. కుక్కలు మొరిగితే చాలు. సిద్దయ్య వెంకట్రాయులు ఏమవుతారో? అని గుండె కొట్టుకొంటూ ఉంది. ఈ గుంజాటనలోనే దాదాపు గంట గడిచింది. రకరకాల గురకలు మెల్లగా ఆరంభమై తారస్థాయినందుకొంటున్నాయి. ఆ గురకల శబ్ద విన్యాసం అంతవరకు నాకు తెలియనిది. మరొకప్పుడైతే నిజంగా పడిపడి నవ్వేవాడిని. కాని ఆ పరిస్థితిలో అప్పటికి నా మనస్సు కాస్త కుదుటబడింది. లాంతరు బాగా తగ్గించాను. చాపమీద రెండు దిండ్లు అటుయిటుగా పెట్టి దుప్పటి కప్పాను. పుస్తకాలను లాంతరు ముందర చిందరవందరగ పడేశాను. మెల్లగా అరలో అడుగుపెట్టాను. ఆ అర మా యింటి 'స్టోర్ రూమ్' అన్నమాట. అక్కడే నట్టిల్లువుంది. ఒక ప్రక్క వరసగా దొంతరులున్నాయి. మరొక పక్క గాదెలున్నాయి. గాదెలకు ఎదురుగా ఉన్న గోడలో రెండు అల్మయిరాలున్నాయి. అందులో ఒకటి మా అయ్యది. రెండోది మా అమ్మది. ఆ గదిలో అడుగు పెట్టగానే గుండె గడగడ లాడింది!

ఒకప్పుడు మా రామన్న ఆ గదిలో పడుకొనేవాడు. "ఎందుకురా ఆ ఉక్కలో పడి చస్తావు?" అని అడిగితే ధ్యానం చేసుకోవాడానికని బుకాయించేవాడు. మా అమ్మ ఓ పెద్ద బుడిగహుండి తన అల్మయిరాలో పెట్టింది. అందులో దినం కొంత ఏడుకొండల వాడి ముడుపుకింద వేసేది. మారుబీగంతో మాటుమణిగిన వేళ ఆ అల్మయిరా తెరిచి మా అన్న బుడిగ హుండీలో నుండి తనకు కావలసినంత చాలాచాకచక్యంగా రాల్చుకొనేవాడు. ఇది దేవరహస్యం. ఇలా కొంతకాలం జరిగింది. ఒకనాడు ఎందుకో మా అమ్మ బుడిగ హుండీని ఎత్తిచూసింది. చాల తేలిగ్గా ఉంది హుండీ! ఇన్నాళ్ళ నుండి వేస్తున్న డబ్బు యేమైనట్టని అమెకు సందేహం కలిగి కోపంతో ఆ హుండీని నేలకేసి కొట్టింది. ఏముంది? దాదాపు ఖాళీ ఆ హుండీ! ఆ హుండీ పాలిటికి ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరుడు మా రామన్న అని ఊహించడానికి మా అమ్మకు ఎక్కువకాలం పట్టలేదు. ఆ తరువాత చూడాలి ఆ అమ్మ స్వరూపం. ప్రళయ కాళికాదేవి అయింది. ఇల్లంతా చిందులు తొక్కింది. పొలాన్నుండి మా అన్నయ్య ఇంట్లో అడుగుపెట్టాడో లేదో అతనిమీద విరుచకపడింది. తరిమితరిమి కొట్టింది. మా ఊరి గుంటకట్ట దాకా తరిమికొట్టింది. చేతి కందకపోతే రాళ్ళతో కొట్టింది. చెట్టంత మనిషి మా అన్న కొట్టిన దెబ్బలు తిన్నాడేకానీ మారుమాట్లాడలేదు. ఆ సంఘటన కండ్లముందు మెదిలితే కాళ్ళు గడగడ వణుకుతున్నాయి. అయినా నిలదొక్కుకున్నాను.

చీకట్లో మెల్లగా తారట్లాడుతూ దొంతర్లను సమీపించాను. ఏ మాత్రం అలికిడయినా గుండె గుభిక్కుమంటూ ఉంది. ఒక్క దొంతరను మెల్లగా కిందికి దించాను. మిరపకాయలు, ధనియాలు, కందిపప్పులు కుండల్లో చేతికి తగులుతున్నాయి. నాకు కావలసింది బియ్యం. భయం ఓర్పును మింగేస్తూ ఉంది. ఆ దొంతరను మరలా అలానే పెట్టేశాను. రెండో దొంతరను దించితే జొన్నలు, సజ్జలు, రాగులు! మూడవ దొంతర్ను ముట్టుకుంటే అంతా చింతపండు మయంగా

ఉంది. అప్పటికే బాగా అలిసిపోయాను. 'ఎవరైనా మేలు కుంటారేమో?' అన్న భయం అలసటకు ఊపిరి పోస్తూ ఉంది. గస తీర్చుకోవడానికి కాసేపు నిలబడ్డాను.

రామాలయంలో వెంకట్రాయులు తాత బ్రహ్మంగారి తత్త్వాలు పాడుకొంటున్నాడు. నిశ్శబ్ద నిశీధిలో ఆ పల్లెవాతావరణంలో పాట గంటకొట్టినట్లు చెవిని పడుతూ ఉంది. 'నిను గనుగొని యముడు బెదురుచుండ, నీ నీతికి హరి సంతోషించ!' అని పాడుతున్నాడు తాత. నా నీతికి ఏ హరి సంతోషిస్తాడో? నన్ను, నా నీతిమాలిన పనిని చూసి ఏ యముడు చంకలు తట్టుకుంటాడో నాకు తెలియదు. ఆ వయసూ కాదు. కాని బెదురుమాత్రం వర్ణనా తీతం. దేవుడిమాట మనసులో మెదిలేసరికి నా చూపు నట్టింటివైపు మళ్ళింది. పండగ పబ్బాలకు, ఒక పొద్దులకు మా అమ్మ ఆ నట్టింటనే దేవుడికి పెడుతూ ఉంటుంది. 'అక్కడనే దేవుడున్నాడేమో! నేను చేస్తున్న దొంగతనం చూస్తుంటాడేమో!' అనుకొనేసరి నా గుండె జలదరించింది. ఆ నట్టింట ఏదో వెలుగు తళుక్కున మెరిసినట్లయింది. నా ఒళ్ళు ఝుల్లుమనింది. గట్టిగా రెండుచేతులతో కళ్ళు మూసుకొన్నాను. కాస్త దడతీరిం తర్వాత మెల్లగా కళ్ళువిప్పి చూశాను. అక్కడేమీ లేదు. అంతా చీకటి. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. ఆ చీకట్లో కనిపించని దేవుడికి మనసారా దండం పెట్టుకొన్నాను. లెంపలేసుకొన్నాను. 'స్వామీ! నా తప్పు క్షమించు. ఈ సారి బియ్యమున్న దొంతరనే చూపించు!' అని మొక్కుకొన్నాను. ఆశ్చర్యం! ఈసారి నేను దించిన దొంతర నిండుకూ బియ్యమే. 'ఒక్కొక్కడు ఒక్కొక్క దోసెడు బియ్యం కూడు తినగలిగితే ఎనిమిది మందికి ఎంత బియ్యం కావాలి?' అని లెక్కల అయ్యవారు అడిగిన ప్రశ్నకు ఠకీమని సమాధానం చెప్పినట్లుగ ఎనిమిది దోసిళ్ళు కావాలనుకొని దేనికయినా మంచిదని పదిదోసిళ్ళకు పెంచాను. ఏ సమయానికి ఎలా ఉంటుందో అనుకొని పన్నెండు దోసిళ్ళుగా నిర్ణయించాను. మూటకట్టేదానికి పాతగుడ్డ 'పర్' మని చింపుతూంటే గుండె టకటక కొట్టుకొనింది. ఆ శబ్దానికి కూడా ఎవరయినా లేస్తారేమో అని! కాసేపు కదలీ మెదలకుండా ఊపిరి బిగబట్టి కూర్చున్నాను. అదృష్టం బాగుంది. ఎవ్వరూ లేవలేదు. పాతగుడ్డలో బియ్యాన్ని జాగ్రత్తగా మూటగట్టాను. దించిన కుండలను యథా ప్రకారం దొంతరలుగా పెట్టాను. ఎక్కడయినా నాలుగు బియ్యపు గింజలు కనబడితే, వాటిని ఉదయాన మా అమ్మ చూస్తే, 'ఇలా బియ్యం ఎందుకు రాలాయి? అని ఆలోచిస్తే- గోవిందా! మా రామన్న గతి కన్నులకు కట్టినట్లు కన్పిస్తూ ఉంది. అందుకే జేబులో పెట్టుకొని ఉండిన అగ్గిపెట్టెను తీసి ఒక్కపుల్ల వెలిగించాను. రాలివుండిన బియ్యపు గింజలను జాగ్రత్తగా దొంతర సందులలోనికి తోసేశాను కనబడకుండా! ఆ వెలుగులో గమనిస్తే, గుండె గుభిక్కుమనింది. నోట తడి ఆరింది. సాధారణంగా మొదట పెద్దకుండ, దానిపైన దానికంటె చిన్నది, అలా పెడుతూపోతే దొంతర శంఖువు ఆకృతిలో ఉంటుంది. కాని చీకట్లో దొంతర పెట్టడంలో తారుమారయింది. ఒక దొంతర బాగా ప్రక్కకువాలి పడిపోవడానికి సిద్ధంగా ఉంది. గబాలున దొంతరను కౌగిలించుకొన్నాను మార్కండేయుడు శివలింగాన్ని కౌగలించుకొన్నట్లు! అడుగు కడవను రెండు కాళ్ళ సందున గట్టిగా పట్టుకొన్నాను. చిట్టచివరి కుండకు తలమోటించాను. నడుమధ్య కుండలను పొట్టకు శరీరానికి ఆనించుకొన్నాను. ఒరిగివుండిన దొంతరను జాగ్రత్తగా దించి

మరలా సర్దిపెట్టేసరికి తలప్రాణం తోక కొచ్చింది. 'బతుకు జీవుడా!' అని బయటపడ్డాను బియ్యంమూటతో!

జామచెట్ల గుబురుమాటున తూగితూగిపడుతూ ఉన్న సిద్దయ్య నన్ను జూచి ఎగిరి గంతేశాడు. ఇద్దరం పిల్లుల్లాగ అడుగులమీద అడుగ్గా ప్రహరీగోడ సమీపించాము. సిద్దయ్య గోడెక్కాడు. నేను బియ్యంమూట వాడిచేతి కందించాను. వాడు వెంకట్రాయులు చేతి కందించాడు. మూట చేతులు దాటింది. సిద్దయ్య గోడ దాటాడు. నేను మెల్లగా తిరిగివచ్చాను. చాపమీద కూర్చున్నాను. ఒక్కసారి చుట్టూ కలయ చూశాను. నిర్భయంగా నిట్టూర్చాను. గబుక్కున దుప్పటి ముసుగుతన్ని పడుకొన్నాను!

ఆ మరసటిరోజు ఉదయం మేమంతా గంజినీళ్ళ బావి గట్టుపైన చేరేసరికి దాదాపు పదిగంటలై ఉంటుంది. అందరం బడికి ఎగ్గొట్టాము. సుమారుపాటి మూడుకుండలు, మూడు బలిసిన కోళ్ళు, బియ్యంమూట అప్పటికి మా వనభోజనానికి మేము సమకూర్చుకొన్న సామగ్రి. బియ్యం, కుండలుమినహాయిస్తే– అలాంటి బలిసిన కోళ్ళను కొనడం మా వయస్సుకు మించిన పని. అందుకే చిన్నబ్బను అడిగాను వెల ఎంత అని? 'మూసిపెట్టిన కోళ్ళకు, కుమ్మరవామిలో కుండలకు వెల ఏముందిలే?' అన్నాడు చాలా తేలిగ్గా. గుండె గుభిక్కుమంది. ఈ సంగతి కాస్త ఊళ్ళో తెలిసిందంటే?– తల ఎత్తుకుని తిరగడం అటుంచి పెద్దవాళ్ళు తాట వలిచేస్తారన్న భయం– భయంగానే మిగిలిపోయింది. రోటిలో తల దూర్చాం. 'అందరూ మూగదెయ్యాల్లా చలిమంటచుట్టూ కూర్చున్నట్లు కూర్చుంటే ముందు ముందు జరిగేదెట్లా? కావలసిన పని చూడండిరా!' అనిపురమాయించాడు వెంకటరెడ్డి. 'జరిగేదేముంది? నిన్ననుకొన్న ముగ్గురు పేటకు పొయ్ మసాలా సామానులు కొనుక్కోని రండి. జాగర్త! అయ్యోర్ల కంట్లో ఎక్కడయినా పడేరు! మిగిలినోళ్ళు అడివిమింద పడి ఎండుపుల్లలు ఏరుకుందాం. అప్పిటికి మద్దేణ మవుతుంది. పేటకు పొయ్‌న వాళ్ళు తిరిగి వచ్చేస్తారు. అందరం కల్సుకొని తెచ్చిన చద్దిబువ్వ ముగిద్దాం. ఆ మిందట వంట పని' అన్నాడు చిన్నోడు. వాడే మా నాయకుడు. నాయకుని మాటకు ఎదురులేదు. ముగ్గురు పేటకు పరుగెత్తారు. ముగ్గురు అడవిమింద పడ్డారు. మేము మూడురాళ్ళతో పెద్దపొయ్యిని పెట్టేదానికి యాతన పడుతున్నాం!

ఆహాఁ! ఆరోజు మావంట వర్ణనాతీతం. నలభీమాది పాకశాస్త్ర ప్రవీణులు మా ముందు బలాదూర్. తెచ్చిన బియ్యమంతా ఒకడు కుండలోపోసి కడుగుతున్నాడు. మరొకడు పొయ్యి రగలిస్తున్నాడు. ఇంకొకడు ఎసరు పెట్టడానికి తెచ్చిన గంజిలాంటి నీళ్ళను వడగడుతున్నాడు. ముగ్గురు కలిసి మూడుకోళ్ళమీద పడ్డారు. చిన్నోడు సునాయసంగా గొంతులు కోసి ఒక్కొక్క కోడిని విసిరిసిరి పారేస్తుంటే– అవి ప్రాణాలు పోలేక ఎగిరెగిరి పడుతున్నాయి. అవి ఎగిరెగిరి పడుతూంటే వెంకట్రాయులు రెక్కలు తట్టుతూ తానూ ఎగురుతున్నాడు. ఇంకొకడు దానికి అనుగుణంగా ఈలవేస్తున్నాడు. పాపం! గొంతులు తెగినతరువాత అవి మాత్రం ఎంత సేపని ఎగరతాయి. చచ్చిన కోళ్ళను తలకొకటి తీసుకొన్నారు. బొచ్చు పెరికారు. పక్కన మంటబెట్టి కాల్చారు. కోసేదానికి తలపడ్డారు. కోసిన మాంసం వేసుకునేదానికి పలకలాంటిదేమీ లేదక్కడ.

అట్లా ఇట్లా చూసి నున్నటి బండను తెచ్చారు. నీళ్ళు బోసి కడిగారు. ఆ బండ మీదనే మాంసమంతా వేశారు. తెచ్చుకొన్నది ఒక కత్తి మాత్రమే! అది గూడ చిన్నకత్తి. దానితో ఎముకలు నరకడానికి వీలుపడక పోతే రాతి మీద రాయి పెట్టి పగలగొట్టారు.

ఏ కుండలో ఎంత బియ్యం ఉడుకుతుందో మితం తెలియక తెచ్చిన బియ్యమంతా ఒక్కకుండలో పోసి ఉడికించడానికి మొదలుపెట్టే ఆ కుండ మమ్మల్ని ఉడికించడానికి తయారయింది. దాంతో కలిసి ఉడకలేక మాకు ఏడుపు వచ్చినంత పని అయింది. పొంగి పొయ్యి పాలవుతూంటే– ఎంత సతమతమైనా ఆ కూడుకూడుగా ఉడకలేక పోయింది. అన్నం ఉడికిందనిపించేసరికి తాతలుదిగి వచ్చారు. ఆ తరువాత మాంసం. ఉప్పు తక్కువని కొందరు. కారం ఎక్కువని కొందరు. ఉడికితే చాల్లేరా అని కొందరు... అబ్బ! మా వంటలు తయారయ్యే సరికి దేవుళ్ళు దిగివచ్చినంత పని అయింది. అంతవరకు మాలోకంలో మేము ఉన్నాం. వంటపనులు తెమిలే సరికి ఈలోకంలో పడ్డాం. చూద్దుముగదా! ఆ అడవిలో అప్పటికే చీకటి చెప్పకుండా చెందకుండా వచ్చి రాజ్యమేలుతూ ఉంది. తల విరబోసుకున్న భూతాల్లా చెట్లు గాలికి రొదచేస్తున్నాయి. ఎక్కడో ఉన్నట్లుండి నక్కలు వికృతంగా అరుస్తున్నాయి. లేతగుండెలతో భయం దోబూచులాడుతూ ఉంది. వంట అయిందనిపించి అందరు మండుతున్న పొయ్యిచుట్టూ కూర్చున్నాం. ఆ వెలుగులో ఒకరి మొగం ఒకరు చూచుకొన్నాం. ఎవ్వరి ముఖంలోనూ కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు.

మాంసమున్న చోటికి దెయ్యాలు వస్తాయనని ఎప్పుడో విన్నమాట ఇప్పుడు భయమై పీడిస్తూ ఉంది.

"చూస్తా కూసుంటే లాబంలేదు. ఎలబారండి. తలకొక్క సామాను ఎత్తుకోండి. మనూరి గుంటకట్టమిందనే కూసోని తిందాం!"– అన్నాడు చిన్నోడు. ఆ మాటతో పుస్తకాల సంచుల్ని, టిఫను కేరియర్లను కలిపి ఇద్దరు జవురుకొన్నారు. తీగ్రతీగలను చుట్టలుగా చుట్టి నెత్తిమీద పెట్టుకొని ఒకడు కూటికుండను, ఇంకొకడు కూరకుండను నెత్తికెత్తుకొన్నారు. కూరకుండలో చిన్నబొగ్గ ముక్కను వేశాడు చిన్నోడు. 'ఎందుకురా'? అని అడిగితే, దెయ్యాలురావట!

అడవిలో 'వెలుతురు చెట్టు' అని ఒక జాతి చెట్టు ఉంది. అది పచ్చిదయినా దివిటీలాగ మండుతుంది. రెట్లావు కొమ్మలు నాలుగు విరిచి ముట్టించు కొన్నాం. కూటికుండ కూరకుండ మోస్తున్న వాళ్ళకు ముందు ఇద్దరు వెనక ఇద్దరు దివిటీల్తో అంగరక్షకులుగా నిలబడ్డాం. మిగిలిన కుండను దిష్టిఫలహారంగా చిన్నోడు 'పోలోపోలి!" అని పాయిమీద పగలగొట్టాడు. అందరూ బాటమీదికి వచ్చి మా ఊరిగుంట కట్టమీదికి బయలుదేరాం.

అబ్బ! ఆరాత్రి మా వనభోజనం ఊరి గుంట కట్టమీద తలుచుకొనే కుందికీ కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వు! మా ఊరి బాటపైన నడుస్తూ పడిపడీ నాలో నేను నవ్వడం ఎవరికంటయినా పడితే నిజంగా నన్నొక పిచ్చివాడనుకుంటారు. నన్ను నేను సమాళించుకొని చూస్తే– అప్పుడు నేను ముగ్గురాళ్ళ మిట్టమీద నడుస్తున్నాను.

ముగ్గురాళ్ళమిట్ట మామిడిమాకుల వంకమిట్ట మనసును నుండి పక్కకు నెట్టేసింది. గత స్మృతిని గుండెపై అందంగా ముగ్గేసేదానికి పూనుకొనింది. ఒక్క క్షణం నిలబడ్డాను. అక్కడే! నిజంగా అక్కడే! ఆ క్షణంలో జరిగినట్లు నా కంటి కగుపిస్తూఉంది. బుడంకాయంత బుల్లోడు వెంకట్రాయులు!... ఒకచేత్తో పగిలిపోయిన పలక, ఇంకొకచేత్తో ఆరుసొట్టలు తిరిగిన అల్యూమినియం టిఫను కేరియర్... నెత్తురుకారుతూ మోకాళ్ళు... మోచేతులు ముక్కు... ఆరునొక్క రాగాన్ని అందుకొన్న వెంకట్రాయులు నా కప్పుడు కనిపిస్తున్నాడు.

అవి యుద్ధం జరుగుతున్న రోజులు. పెట్రోలు కరువు. అయినా ఆనాటి ప్రభుత్వం పెట్రోలు ధరలు పెంచి వేడుక చూడలేదు. పెట్రోలు దొరక్కపోతే బస్సులన్నీ బొగ్గుతోనే నడుపుతున్నారు. బస్సు వెనకలో పెద్దపీపా అమర్చి ఉంటారు. దానినిండుకు బొగ్గు వేస్తారు. బొగ్గును మండించి దాని నుండి ఓ గ్యాస్‌ను ఉత్పత్తిచేస్తారు. ఆ గ్యాస్‌లో బస్సు నడుస్తుంది. గ్యాస్ శక్తి మీద బస్సువేగం ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ఆ బస్సులు మిట్టలమీద ఎద్దులబండి లాగ మెల్లగా ఎక్కుతాయి. మా ఊరి బాటపైన అలాంటి బొగ్గు బస్సు ఒకటి నడుస్తూ ఉండేది. ఆ బస్సు మామిడి మాకులవంక మిట్టమీద నిదానంగా ఎక్కుతుంటే మాలో ఒకరిద్దరు బస్సువెనక నిచ్చెనమీద తెలియకుండా ఎక్కికూర్చునే వాళ్ళం. ముగ్గురాళ్ళ మిట్టమీద ఆ బస్సు నిదానంగా ఎక్కుతుంటే జాగ్రత్తగా కిందికి దూకేసే వాళ్ళం. ఒక్క మైలుదూరం నడక తప్పిందని ఉప్పొంగి పోయేవాళ్ళం.

ఆ రోజు వెంకట్రాయులు ఒక్కడేఎక్కి నిచ్చెనమీద గొంతుకూర్చున్నాడు– మామిడిమాకుల వంకమిట్టమీద బస్సు మెల్లగా ఎక్కుతూంటే! బస్సు వెళ్ళి పోయింది. మేమంతా వెనక నడిచి వెళ్ళుతున్నాం. మేము ముగ్గు రాళ్ళ మిట్టమీద చేరేసరికి మా కెదురైన దృశ్యం వెంకట్రాయుల దీనాకృతి. ఒళ్ళంతా దుమ్ము నిండిపోయింది. మోచేతులు, మోకాళ్ళు, ముక్కు పగిలి రక్తం కారుతున్నాయి. ఇదైనా ఓర్చుకోగలిగాడు కానీ, పాపం! వెంకట్రాయులు పగిలిన పలకను, సొట్టలు తిరిగిన అల్యూమినియం టిఫను కేరియర్‌ను చూసి పడిపడీ ఏడ్చాడు. పగిలిన పలక చూపిస్తాడు. ఏడుస్తాడు. సొట్టలు తిరిగిన అల్యూమినియం కేరియర్‌ని చూపిస్తాడు. ఏడుస్తాడు. ఆ రోజు వాడి దీనస్థితిని చూసి నిజంగా నేనూ ఏడ్చాను. ఆ రోజు బొగ్గు బస్సుకు ముగ్గురాళ్ళ మిట్టమింద వాడి దురదృష్టం మంచి ఊపు అందుకొన్నట్లుంది. ఈ రోజు తలచుకొనేకొద్దీ నవ్వు!

మా ఊరి మట్టిబాటమీద పిచ్చివాడిలాగ నవ్వుతూ నడుస్తున్నాను గతస్మృతి నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే!

"ఇదేనా అబ్బోడా రావడం! పిల్లజెల్లా అంతా బాగుండారా! అదేంది నీకు నువ్వే పిచ్చోడి మాదిరి నవ్వుకుంటుండావే!..." పొద్దుగూట్లో పడుతుంటే గొర్రెమందను యింటికి తోలుకొనిపోతున్న గొల్ల గోవిందు అడిగాడు. అదిరిపడి ఈ లోకంలో పడ్డాను. అప్పుడు నేను మర్రిమాకుల బండవద్ద నడుస్తున్నాను. ఇక కూతదూరంలో మా ఊరు ఉంది. నా స్థితి నాకే సిగ్గనిపించింది.

"అవునుబావా!... ఇదే రావడం... అఁ! అంతా బాగుందారు" కొతికి కొతికి సమాధానం చెప్పాను. అరమరికలు లేని పల్లె బతుకుల్లో వావివరసలకు కులమత ప్రమేయాలుండవు. నా నవ్వును గురించి మళ్ళీ అడగతాడేమో అనుకొంటూ ఉండగానే, ఒక గొర్రె బాటపక్కన పొలంలో పడింది. దానిని అదిలిస్తూ పరుగెత్తాడు గోవిందు. 'బతుకుజీవుడా!' అని నేను కాస్త తొందరగా గొర్రెమందను దాటి ముందుకు నడిచాను.

ఇక కొన్ని నిమిషాల్లో మా ఊరి గుంటకట్టమీద ఉంటాననుకొనేసరికి గుండె నిండుకూ ఆనందమే! బాటపక్కన చింతచెట్లు... కొన్ని తరాలను చూచిన చెట్లు- నన్ను చూసి నవ్వుతున్నట్లున్నాయి. ఈ మధ్య తలెత్తిన చెట్లు... పిల్లగాలుల్తో వింజామరలు వీస్తున్నాయి. ఆ గుంటకట్ట మీద నా బాల్యదశ దిసమొలలో నా ఎదుట ప్రత్యక్షమయింది. ఉగాది పండగనాడు తిండితిప్పలు మాని ఆడిన గచ్చకాయలాటలు... కార్తీక మాసంలో రాత్రిపూట పట్టిన సుడుదులు... వేసవి వెన్నెల్లో ఆడిన చెడుగుడు... ఉప్పరపట్టి ఆటలు... కట్టమీద వారధీమీద కూర్చుని అర్థరాత్రి వరకు చిన్ననాటి నేస్తం వెంకటరెడ్డితో గడిపిన రాత్రిళ్ళు నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి!...

నిమిషాలు క్షణాల్లో గడిచిపోయాయి. నేను మా ఊరి గుంటకట్టపై నిలబడ్డాను. కనుచీకటి ఆవరిస్తూ ఉంది. ఆ గుంటకట్టమీద మొట్టమొదట నా కంటపడిన దృశ్యం నన్ను చకితుణ్ణి చేసింది. ఆ దృశ్యం నేను ఊహించలేనిది. సహించలేనిది. అదొక పూరిగుడిసె. ఆ గుడిసె ముందొక పందిరి. పందిరిగూటానికి వేలాడుతూ ఉందొక బోర్డు. ఎర్రటి అక్షరాల బోర్డు! పేదసాదల రక్తాన్ని పిండి- ఆ రక్తంలో ముంచి రాసినట్లున్నాయి అక్షరాలు... 'గవర్నమెంటు సారాయి అంగడి' అని!.

ఆ అసురసంధ్య వేళలో అక్కడి వాతావరణం దారుణంగా ఉంది. కొందరు తాగి తగవులాడుకొంటున్నారు. తప్పతాగిన కొందరు గుంటకట్టమీద బండలమీద ఒంటిమీద బట్టలుండేది ఊడేదికూడ తెలియకుండా పడి దొర్లుతున్నారు. నా పసితనంలో గుంటకట్టమీద గుడిసెలో ఆకువక్క అమ్ముకొంటూ ఉండిన అలిమేలు తన అంగడిని గవర్నమెంటు సారాయి అంగడి ముందుకు మార్చింది. స్థలం మార్పుతో వ్యాపారం మార్పు చెందింది. ఆకువక్క స్థానాన్ని కూరదోసె ఆక్రమించుకొన్నాయి. ఆమె చేతికింద ఇప్పుడు ఇద్దరు పనిచేస్తున్నారు. ఒకడు దోసె పోస్తూఉంటే ఇంకొకడు సప్లయ్ చేస్తున్నాడు. ఓ అరుగుమీద కూర్చుని ఆమె చిల్లర డబ్బులు వసూలుచేస్తూ ఉంది. ముక్కుదాకా మెక్కి అప్పుబెట్టినవాళ్ళను మధ్య మధ్య ఎడాపెడా తిడుతూ ఉంది. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా తాగుతున్న తీరుచూస్తే ఒళ్ళు జలదరించింది. ఒక నాటికి ఇప్పటికి తేడా తేల్చలేని పరిస్థితి అది. నా చిన్నతనంలో ఆ గుంట నిర్మలమైన నీటితో తొణికిసలాడుతూ ఉండేది. గుంటనిండుకు పచ్చనికప్పు కప్పినట్లుగ తామరాకులు... వికసించిన పూలు... కనువిందుగా ఉండేది. సాయంకాలమైతే ఊళ్ళో పెద్దలు వచ్చి ఆ బండలమీద కూర్చునేవాళ్ళు. తప్పు చేసినవాళ్ళని విచారించి దండించే వాళ్ళు. నాకు ఇప్పటికి ఇంకా బాగా జ్ఞాపకముంది. నీతికి నియమానికి కట్టుబడి కాపురం చేశారు ఆ ఊళ్ళో. ఆ రోజుల్లో ఎక్కడో

అడవుల్లో ఎవ్వరికీ తెలియకుండా 'కాపుసారా' కాచేవాళ్ళట. పొద్దస్తమానం కాయకష్టం చేసే శ్రమజీవులు ఎవ్వరి కంటబడకుండా అంత పుచ్చుకుని ఎక్కడో ఒళ్ళు తెలియకపడి నిద్రపోయేవాళ్ళట. ఒకసారి బంగారుపని చిన్నబ్బ తప్పతాగి ఊళ్ళో అసభ్యంగా ప్రవర్తించాడని మద్దిస్తం చేశారు. పది రూపాయలు తప్పు వేశారు. మీసాలు మెలేసి తిరిగే చిన్నబ్బ పదిమందిలో తప్పు ఒప్పుకొని పదిరూపాయలు తప్పుగా చెల్లించి తలవంచుకొని వెళ్ళిపోతున్న దృశ్యం నా కన్నులకు కట్టినట్లు కనిపిస్తూనే ఉంది. అలాంటి ఊళ్ళో గవర్నమెంటు సారాయి అంగడి వెలిసింది. మూడూళ్ళకు మంచినీళ్ళకు ఆధారమైన నిండు గుంట ఎండిపోయింది– నీతి భీతి ఎండిపోయినట్లు! ఎండిన గుంటను, సారాయి అంగడి ముందు మందుతున్న కళ్ళను చూడలేక తల దానంతట అది వాలిపోయింది. అడుగు మీద అడుగు వేసుకుంటూ ఊళ్ళో అడుగు పెట్టాను.

మూడు కాళ్ళ ముసలాయన గంగులయ్య తాత నన్ను చూసి నిలబడ్డాడు. వయసు మళ్ళడంతో చూపు బాగా తగ్గినట్లుంది. ఊతకర్రమీద పందు బారిన శరీరాన్ని ఊనించి, ఎడమచేతి అరిచేతిని కంటిమీద పడుతున్న వెలుగుకు అడ్డంగా పెట్టుకొని నిదానించి చూశాడు. నన్ను గుర్తించాడు.

"ఇదేనా నాయినా రావడం? అంతా బాగుండారా!" పల్లెల్లో మనిషి కనిపిస్తూనే క్షేమ సమాచారాలు అడగడం పరిపాటి.

గంగులయ్య తాత అడిగినదానికి "ఆఁ! ఊఁ? అంటూ బదులు చెబుతున్నానే గాని నా చూపు ఊరిమీద ఉంది. అది తాత పసిగట్టినట్టున్నాడు.

"ఏం జూస్తావులే నాయినా! లచ్చిఁవి తాండవమాడ్తావుండె ఒకప్పుడు. అట్లాంటి ఊరు పాడుపడి పొయ్యింది. తల్చేవాడే లేదు. ఈ కరంటు రానన్నా వచ్చింది. బాయి కొక మోట్రు పెట్టేసినారు. 'రాఁవన్న' 'రాఁవో' అని కపిలతోలే నాదుడే లేదు. పనీపాటా లేకపాయ. ఆ గుంట కట్టమింద సూళ్ళా?... తప్ప తాగేసి తన్నులాడుకుండేది. పెద్దంతరం సిన్నంతరం గంగపాలయ్యింది. ఎవుడు నాయినా ఈ ఊర్ని గురించి పట్టించుకునే మొగోడు? అంతా అయిపోయింది. రాగి ఆకులో కొన మాత్రమే మిగిలుండాది. ఇంకీ ఊళ్ళు బాగుపడబొయ్యేది లేదు నాయినా!.." గంగులయ్య తాత గొంతు బొంగురు పోయింది. ఏదో పోగొట్టుకొన్న తపనతో తాత తపిస్తున్నట్లుంది.

"చూస్తుండావుగదా! ఈ యీదు లెట్లుండాయో? ఒకప్పుడు ఇయ్యేళ కాడ ఆలమందలు గొర్రెమందలు ఈదులు పట్టతావుండెనా? పాడికోసం, పంటకు ఎరువు కోసం ఇంటికొక్క మందగొడ్లుండె. దారిన పొయ్యేవాడు దాహమంటే మజ్జిగ నీళ్ళిస్తుంటిమి. ఇప్పుడవేమీ లేవు. అదేందో ఎలచ్చన్లంట! అవుండాయి. వాటితో తలలు పగిలిపోతా ఉండాయి. ఉండేది ఉడ్డకు ముగ్గురు తక్కవైతే కూడ అందులో మల్లా పార్టీలంట. చాలందానికి కోర్టులంట. కొంపలు కూలి పోతాఉండాయి. పోనీ! నువ్వే చెప్పు నాయినా! నీ చిన్నతనంలో సూస్తుంటివి గదా!– ఎట్లాంటి కొట్లాటైనా రచ్చబండ దగ్గర తీరిపోతాఉండె! ఇప్పుడదంతా లేదు నాయినా!

రాంవ! రాంవ! ఈ కడుపుసొద సెప్పితే తీరేది గాదు. ఈ ఊళ్ళింక బాగుపడబొయ్యేదిలేదు. వస్తా నాయినా! మడికాడ గొడ్లుండాయి!" అంటూ తాత ముందుకు సాగాడు.

తాత చెప్పింది అక్షరాలా నిజం. ఆ వేళప్పుడు వీధులు, ఆలమందలు గొర్రెమందలతో నిండిఉండేవి. పిల్లలు కేరింతలూ కొడుతూ ఆడుకొంటూ ఉండేవాళ్ళు. ఏ దూడ కుమ్ము తుందో ఏ ఆవు తొక్కేస్తుందో అని తల్లులు పిల్లల్ని హెచ్చరిస్తూ ఇండ్లలోకి లాక్కొనిపోతూ ఉండేవాళ్ళు. పిల్లలు గోల చేస్తూ ఉండేవాళ్ళు. ఆ చిహ్నాలేమీ కనుపించలేదక్కడ. ఉదయ మొకసారి సాయంత్ర మొకసారి కళ్ళాపు చల్లడంతో వీధులు అలికి ముగ్గు పెట్టినట్లు కళకళలాడుతూ ఉండేవి. ఆ సంప్రదాయం కూడ నశించి నట్లుంది. వీధులు దుమ్ముకొట్టు కొంటూ పాడుపడినట్లున్నాయి. రెండడగులు ముందుకు వేశాను. ఊరి మధ్య రామాలయం కంటబడింది. ఆ గుడిని చూసేసరికి గుండె చెరువయింది. ఆ గుడి... ఆ ఊరికి మకుటాయ మానంగా వెలుగొందిన అందాల గుడి... అంతా పడిపోయింది. గర్భగుడిలో పుట్టలు పెరిగాయి. ఆలయం వెనుక భజనతోట. తోటవుండిన చిహ్నాలు కూడ లేవక్కడ. చీకటిని మరుగ్గా చేసుకొని ఊళ్లో ఆ ప్రదేశాన్ని మరుగుదొడ్డిగా ఉపయోగించు కొనేటట్లు ఉంది. రచ్చబండవద్ద మర్రిమాను. ఎన్నో ధర్మా ధర్మాల చర్చలకు సాక్షీభూతంగా నిలబడ్డమాను. కొమ్మలంతా ఎవరో నరికేస్తే- బోదెమాత్రం మొద్దులాగ నిలబడివుంది, నాలుగుపాదాల ధర్మగోవు ఒంటి కాలిమీద నిలబడ్డట్టు! ఎంతో సందడిగా ఉండవలసిన ఆ సంజవేళ పాడుగొట్టుకొంటూ ఉంది. నా గుండె కలుక్కుమనింది. అక్కడ నిలబడలేక నిలబడి పాడు బడినట్లున్న ఆ కొంపల్ని చూడలేక తలవంచాను. "అప్పుడే ఏమయిందిలే! ఇంకాచూడు! బాగాచూడు. నువ్వు మరవలేని మీ ఊరిని బాగా చూడు!" అని నన్ను ఎగతాళిచేస్తున్నట్లు ఊరి మధ్యలో ఒక విద్యుద్దీపం వెలిగింది. పంచాయతీ ఆఫీసు అనబడే పూరిగుడిసెలో గ్రామాభ్యుదయం, పాడిపంటలు... ఏవేవో పెద్ద పెద్ద మాటలు రేడియోలో ప్రసారమవు తున్నాయి- పాతికేళ్ళలో దేశం సాధించిన ప్రగతిని చాటుతూ!

"దేశానికి వెన్నెముకలైన గ్రామాలు ఇవేనా? ఈ లాంటి గ్రామాల మీదనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందా! ఈ దేశం ఎన్నటికైనా 'సుఫలాం!' అవుతుందా?"- అన్న ఆలోచనలు నా మనస్సును కెలుకుతుంటే- ఊరు మళ్ళీ ఒక్కసారి నా కంటిముందు మెదులుతూ ఉంది. ఎండిపోయిన మంచినీటిగుంట... గుంట కట్టమీద మండుతున్న కళ్ళు... శిధిలమైన రామాలయం... పాడుకొట్టుకొంటున్న కొంపలు... రేడియోలో పంచవర్ష ప్రణాళికలు... గ్రామభ్యుదయం... నా మనస్సును పిండుతున్నాయి.

నాకు తెలియకనే నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి!

"కన్నీళ్ళు పరిష్కారానికి మార్గం కాదు. మీ ఊరు మరుపురాని ఊరుగా మిగలా లంటే కన్నీళ్ళతో కాదు గదా?" అని కర్తవ్యం చేతులెత్తి ఆహ్వానిస్తుంటే అడుగు ముందుకు పడింది!●

భారతి
(1, మార్చి 1974)